పనులు పూర్తి కాకుండానే.. ప్రారంభమా?





గతనెల 26న మ్యూజియంను హడావుడిగా ప్రారంభించిన దృశ్యం

సర్పవరం జంక్షన్(కాకినాడ), మార్చి 3: జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ బీచ్ ఉంది. కాకినాడ తీరాన్ని శోభాయమానంగా చేసేలా గతప్రభుత్వ హయాంలో స్వదేశీ దర్శన్ నిధులతో గ్లాస్‌హౌస్, ఫ్రంట్ బీచ్, లేజర్ షో, మ్యూజిక్ ఫౌంటేయన్ వంటి పర్యాటక హంగులను ఏర్పాటు చేసింది. బీచ్‌లో యుద్ధ విమాన మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశానికి సేవలందించిన టీయే 142 యుద్ధ విమాన మ్యూజియాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. కానీ పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా దీన్ని ప్రారంభించారు.

వినోదాన్ని పంచని మ్యూజియం

దేశ రక్షణ, భద్రత కోసం దేశ త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులకు వినోదం, విజ్ఞానం పంచేందుకు యుద్ధ విమాన మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మ్యూజియం ఏర్పాటుకు అప్పట్లో రూ.9.03 కోట్ల గుడా నిధులతో యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులకు 2020, అక్టోబరులో శంకుస్థాపన చేశారు. బిల్లుల చెల్లింపు జాప్యంతో నిర్మాణపనులు నెమ్మదిగా సాగాయి. మూడున్నరేళ్ల తర్వాత గతనెల 26న యుద్ధ విమాన మ్యూజియాన్ని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు జరగకపోయినా ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావుడిగా దీన్ని ప్రారంభించేసినట్టుగా తెలుస్తోంది. యుద్ధ విమానం దేశానికి అందించిన సేవలు డిస్‌ప్లే, వీడియో, ఆడియో ద్వారా తెలియచేసే సమాచారం, గేమింగ్ జోన్, విజ్ఞాన సమాచారం తెలియజేసే వ్యవస్థలు ఏర్పాటు చేయకుండానే ప్రారంభించడంపై విమర్శలువస్తున్నాయి.

- » కాకినాడ బీచ్‌లో హడావుడిగా యుద్ధ విమాన మ్యూజియం ప్రారంభం
- » ఇంకా మిగిలి ఉన్న నిర్మాణ పనులు
- » ఎన్నికల ముందు ప్రచారం కోసమేనని విమర్శలు
- » మూడున్నరేళ్లుగా జాప్యం
- » అసంతృప్తిలో సందర్శకులు

ఇవిగో ప్రత్యేకతలు..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యాదేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఈ విమానం ఒక్కసారి ఫ్యూయల్ నింపుకొని ప్రపంచ దేశాలను 16 గంటల్లో చుట్టి వచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం గమనార్హం. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విమానాన్ని తమిళనాడునుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా పురాతన యుద్ధ విమానాన్ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ తీసుకువచ్చింది. ఫిబ్రవరి 25న ప్రారంభించారు.

ఏమీ పూర్తికాకుండానే..

యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుదీకరణ పూర్తిస్థాయిలో నిర్వహించలేదు. మ్యూజియం లోపల పూర్తిస్థాయిలో లైటింగ్ వ్యవస్థ కూడా లేదు. రాష్ట్రంలో 3వ యుద్ధ విమాన మ్యూజియం ఏర్పాటు చేయడం గర్వకారణంగా ఉంది. ఇందులో యుద్ధ సమయంలో విమానాలను వినియోగించే తీరు, ఆయుధాల నిల్వ, వాటిని ఎలా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలను తెలియజేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలి. కానీ ఇవేమీ ఏర్పాటు చేయకుండానే దీన్ని హడావుడిగా ప్రారంభించారు. అధికారులు విశాఖ తరహాలో అన్ని హంగులతో సత్వరంగా అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు. వేసవి సెలవులు రానుండడంతో తొందరలో యుద్ధవిమాన మ్యూజియాన్ని సందర్శకులకోసం సిద్ధం చేసి ప్రవేశానికి అనుమతించాలని వారు కోరుతున్నారు.

చిన్నారులకు ఆహారం ఎలా?



గొల్లప్రోలు రూరల్, మార్చి 4: చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు అవసరమైన సరుకుల సరఫరా నిలిచిపోయింది. కొద్దిరోజులపాటు సమీప కేంద్రాలనుంచి తెచ్చి ఆహారం వండగా మరికొన్నిరోజులు సమీప పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో చిన్నారుల కడుపు నింపారు. సరుకులు నిండుకుని నెలరోజులు గడిచినా ఇంతవరకూ రాకపోవడం, ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నారులకు పోషకాహారం అందని పరిస్థితి నెలకొంది. క్రమం తప్పకుండా కేంద్రాలకు చేరాల్సిన సరుకులు నెలరోజులకు పైగా అందకపోవడంతో చిన్నారులకు ఆహారం అందించడం కష్టసాధ్యంగా మారింది. అంగన్‌వాడీ వర్కర్లు సర్దుబాట్లతో కాలం నెట్టుకొస్తున్నారు.

తరచూ సమస్యలు

జిల్లావ్యాప్తంగా 2,750 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు బాలామృతం, పాలు, గుడ్లు, వైఎస్ఆర్ కిట్లతోపాటు పోషకాలు కలిగిన ఆహారం అందించాల్సి ఉంటుంది. బాలామృతం, పాల ప్యాకెట్లు, వైఎస్ఆర్ కిట్లు పూర్తిస్థాయిలో రాకపోవడం, గుడ్లు నాణ్యత లేకుండా ఉండడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. సరఫరా అయిన గుడ్లల్లో పాడైనవి ఎక్కువగా ఉంటున్నాయి. ఇప్పుడు కేంద్రాలకు ప్రతినెలా సరఫరా కావాల్సిన బియ్యం, కందిపప్పు, వంట నూనెలు ఫిబ్రవరి నుంచి నిలిచిపోయాయి. గొల్లప్రోలు మండలం సహా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫిబ్రవరి 1వ తేదీకే సరుకుల నిల్వలు ఖాళీ అవ్వడంతో అందుబాటులో ఉన్న కేంద్రాలనుంచి సరుకులు అప్పుల పద్ధతిపై తెచ్చి చిన్నారులకు ఆహారం పెట్టారు. సదరు కేంద్రాల్లోనూ సరుకులు నిండుకోవడంతో సమీపంలో పాఠశాలల నుంచి మధ్యాహ్న భోజనం తెచ్చి చిన్నారులకు పెడుతున్నారు.

- » అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన సరుకుల సరఫరా
- » నెలరోజులుగా ఇదే పరిస్థితి
- » పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు

అంగన్‌వాడీలు సతమతం

నెలరోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ బియ్యం, కందిపప్పు, నూనె తదితర సరుకులను కేంద్రాలకు అందేలా చూడాల్సిన ఐసీడీఎస్ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాలశాఖ ద్వారా బియ్యం, పప్పులు, నూనెలు అందాల్సి ఉందని చెబుతున్నారు. సరుకులు ఎప్పుడు వస్తాయో తెలియక, తల్లిదండ్రులకు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అంగన్‌వాడీ వర్కర్లు సతమతమవుతున్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సొంత డబ్బులతో చిన్నారులకు ఆహారం వండించి పెడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, పప్పులు, నూనె, ఇతర సరుకులు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కలెక్టరేట్ వద్ద వెలుగు యానిమేటర్ల ధర్నా

కాకినాడ సిటీ, మార్చి 4: ఇటీవల జరిగిన వెలుగు యానిమేటర్ల 36గంటల దీక్షల సందర్భంగా సెర్ప్ సీఈవో పరిష్కరిస్తామని చెప్పిన హామీల మేరకు జీవోలు విడుదల చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్‌వద్ద సోమవారం వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా చేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వీవోఏ సంఘం జిల్లా కార్యదర్శి పోలిశెట్టి మేరి మాట్లాడుతూ ఒక ఐఏఎస్ అధికారి సెర్ప్ సీఈవో ఇచ్చిన హామీలకే దిక్కులేని పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. ఉద్యోగ నిర్వహణలో అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించడం ద్వారా ఐఏఎస్ అధికారులు తమ రాజకీయ భవిష్యత్తుని గ్యారెంటీ చేసుకుంటున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చల్లా మిగులుతుందన్నారు. ఇచ్చిన హామీల మేరకు జీవోలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి నెలరోజులు దాటుతున్నా అతీగతీ లేదన్నారు. ఇప్పుడు ఉద్యోగానికి రాజీనామా చేసి అధికార పార్టీ తరఫున పోటీకి సిద్ధమై ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలకు ప్రభుత్వమే బాధ్యత వహించి జీవోలు ఇవ్వాలని, మూడేళ్ల కాలపరిమితి జీవోను రద్దు చేయాలని, అక్రమంగా తొలగించిన వీవోఏలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలోఉధృత పోరాటాలకు సిద్ధపడాలని వీవోఏలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకురాళ్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద ధర్నా చేస్తున్న వీవోఏలు

పదో తరగతి పరీక్షలకు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి: డీఈవో

కాకినాడ రూరల్, మార్చి 4: ఈనెల 18 నుంచి 30 వరకూ జరగబోయే పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్‌టిక్కెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో విభాగం, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలను ఎంపిక చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు.

'30లోపు ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి'

కాకినాడ రూరల్, మార్చి 4: జిల్లాలోని రెండు మోడల్ స్కూల్స్(ఆదర్శపాఠశాల) శంఖవరం, హంసవరంలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశాలకుగాను ఆన్‌లైన్ ద్వారా ఈనెల 30లోపు www.cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్షను సంబంధిత పాఠశాలల్లో నిర్వహిస్తారన్నారు. వివరాలకు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి 'స్పందన'కు 403 అర్జీలు

కాకినాడ సిటీ, మార్చి 4: జిల్లాస్థాయి స్పందన ప్రజా విజ్ఞాపన స్వీకారంలో 403 అర్జీలందాయి. సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ కృతికాశుక్లా.. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్వో డి.తిప్పేనాయక్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ 'స్పందన'కు 70 అర్జీలు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 4: జిల్లావ్యాప్తంగా 70 అర్జీదారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరై తమ గోడును ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్‌కు విన్నవించారు. ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారుల అర్జీలు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తద్వారా పోలీస్‌శాఖపై మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. 70 ఫిర్యాదులురాగా వాటిలో సివిల్ వివాదాల సంబంధించి 23, కుటుంబ తగాదాలు 19, ఇతర సమస్యలు సంబంధించి 28ఫిర్యాదులు అందాయి. అర్జీదారులకు రామారావుపేటకు చెందిన ఛార్టెర్డ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని ఎస్పీ వడ్డించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలి

» లేకుంటే పైప్‌లైన్ పనులు జరగనివ్వం: అఖిలపక్ష నాయకులు

కాకినాడ సిటీ, మార్చి 4: కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో పడిన చమురు, గ్యాస్ వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కాలని, గ్యాస్ వెలికితీత కారణంగా వేట నిషేధానికి గురై జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ కాకినాడ జిల్లా అఖిలపక్ష పార్టీల నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఛైర్మన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, టీడీపీ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, జనసేన నాయకుడు సుంకర సురేష్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కృష్ణమోహన్, ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ మాట్లాడారు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో చమురు, గ్యాస్ వెలికితీత కారణంగా వేటనిషేధానికి గురై నష్టపోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించి ఉపాధి కల్పించాలని, కాకినాడ ప్రజలకు అతి తక్కువ ధరకు ఇంటింటా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేయకపోయినా, ఆంధ్రప్రదేశ్‌కు రావల్సిన వాటా దక్కకపోయినా అఖిలపక్షం ఆధ్వర్యంలో పైప్‌లైన్ పనులు అడ్డుకుంటామని ప్రకటించారు.కార్యక్రమంలో ఏపీ మత్స్యకార సంఘం జేఏసీ ఛైర్మన్ సైకం రాజశేఖర్, పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, కార్మిక నాయకులు పీఎస్ నారాయణ, పెద్దిరెడ్డి సత్యనారాయణ, మత్స్యకార నాయకులు అద్దటి శివ, వలమాటి ధర్మారావు, సంగాడి వీరబాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వర్తించండి: ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, మార్చి 4: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకత, అంకితభావంతో వ్యవహరించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ సూచించారు. ఉన్నతస్థాయి అధికారులనుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు బృందాలుగా ఏర్పడి విధులు నిర్వహించనున్న నేపథ్యంలో వారికి జిల్లా పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహించేందుకు ఏర్పాటైన ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, మొబైల్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేసే స్క్వాడ్‌ల్లోని పోలీస్ బృందాలకు, అధికారులకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు నిర్దేశించిన నియమిత నియమావళి, నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన విధులగురించి అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు పర్యవేక్షణలో జిల్లా ఎన్నికల శిక్షణ అధికారులు, అసెంబ్లీ స్థాయి అధికారులు క్షుణ్ణంగా వివరించారు. సదస్సుకు హాజరైన బృందాలకు ఉన్నశాఖాపరమైన సందేశాలను శిక్షణ అధికారులు నివృత్తి చేసి ఎన్నికల విధులకు సమాయత్తం కావాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించేలా సంసిద్ధం కావాలన్నారు. ఈ సదస్సుకు కాకినాడ, పెద్దాపురం పోలీస్ సబ్‌డివిజన్ల ఎన్నికల శిక్షణఅధికారులు ఎస్.నారాయణమూర్తి, కేఎస్‌వీ ప్రసాద్‌రావు, ఏఎల్ఎంపీ లు పి.జగదీశ్వరావు, పి.నాగేశ్వరరావు, కాకినాడ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి హనుమంతురావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీరామ కోటేశ్వరావు, జిల్లా పోలీస్ కార్యాలయ ఇన్‌స్పెక్టర్‌లు పెద్దిరెడ్డి రామచంద్రరావు, పి.ఈశ్వరుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.





హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది.. శిక్షణ ఇస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ప్రత్తిపాడులో వరుపుల రాజా వర్ధంతి - 5లో



ప్రత్తిపాడులో రాజాకు నివాళులర్పిస్తున్న రాజప్ప, సుజనకృష్ణరంగారావు, సత్యప్రభ తదితరులు

జీజీహెచ్ సిబ్బందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

జీజీహెచ్(కాకినాడ), మార్చి 4: మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ జీజీహెచ్ మహిళా ఉద్యోగులు, సిబ్బందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జీజీహెచ్ గైనిక్ ఓపీ విభాగంలో సోమవారం ఈ పరీక్షలు జరిగాయి. ఆర్ఎంసీ, జీజీహెచ్‌ల్లో విధులు నిర్వర్తించే మహిళా సిబ్బంది ఈ పరీక్షలు చేయించుకున్నారు. మొదటిరోజు సోమవారం 19మందికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంపీఆర్ విఠల్ తెలిపారు.

జీజీహెచ్‌లో సమ్మెకు సిద్ధం

జీజీహెచ్(కాకినాడ), మార్చి 4: పీఎఫ్ యాజమాన్యం వాటా చెల్లింపు, వేతనాల పెంపుకోసం నెలరోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు, కాంట్రాక్ట్ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నట్లు జీజీహెచ్ శానిటేషన్ వర్కర్లు తెలిపారు. సోమవారం వారు మాతాశిశు విభాగంనుంచి ఓపీ విభాగం వరకు నిరసన ర్యాలీ చేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

- రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరూ మైనర్లే
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస సమీపంలో చెట్టుకు ఉరేసుకుని చనిపోయిన వైనం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

అరకులోయ, మార్చి 4: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలో కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని హుకుంపేట ప్రాంతానికి చెందిన ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి అరకులోయ ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేటలో నివాసం ఉంటున్న చప్పా చైతన్య (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక జ్యోత్స్న (14) హైస్కూల్‌లో చదువుతున్నది. వీరిద్దరూ గత నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చారు. తర్వాత ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆ ప్రాంతంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలోని కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఇద్దరూ ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా వారిద్దరూ రాజమండ్రి ప్రాంతానికి చెందిన చైతన్య, జ్యోత్స్నగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

చైతన్య జ్యోత్స్న మృతి విషయం తెలియగానే ఇక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చైతన్య ప్రేమలో ఉన్నట్టు తెలియదని తండ్రి చప్పా శ్రీను లబోదిబోమని విలపించాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, చైతన్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో పరీక్ష రాసేందుకు సిద్ధ మవుతున్నాడని, రెండు రోజుల్లో పరీక్ష రాయాల్సి ఉందని, ఈసారి తప్పకుండా పాసవుతానని చెప్పాడని, ఈ క్రమంలో ఇంత అఘాయిత్యానికి పాల్పడతాడని ఊహించలేదని ఆయన వాపోయాడు. జ్యోత్స్న బంధువులు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఊరంతా వెతి కామని, ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంతలో విషాద వార్త వినడాన్ని తట్టుకోలేకపోతున్నామని వాపోయారు. వారి ప్రేమబంధాన్ని తమకు చెప్పినా బాగుండేదని రోదించారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

తుని రూరల్, మార్చి 4: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైళ్లల్లో చార్జింగ్ పెట్టి నిద్రపోతున్న ప్రయాణికులే లక్ష్యంగా సెల్‌ఫోన్‌లు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8 కంపెనీలకు చెందిన 6 సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకుని కాకినాడకు చెందిన వల్లి రాజేష్, పిఠాపురానికి చెందిన బోడకుర్తి రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎస్. రామకోటిను అభినందించారు.



సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

దిండి రిసార్ట్స్‌లో అవకతవకలు

మేనేజర్, నలుగురు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు

మలికిపురం, మార్చి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం దిండి ఏపీ టూరిజం రిసార్ట్స్‌లో భారీగా అవకతవకలు జరిగినట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. రిసార్ట్స్‌లో సుమారు కోటి రూపాయల మేర అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. మేనేజరు ఫణీంద్రతో పాటు మరో నలుగురు ఉద్యోగులు 2021 నుంచి ఈ అవకతవకలకు పాల్పడ్డారన్నారు. గత 25 రోజులుగా దిండి రిసార్ట్స్‌లో టూరిజం, విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలించి మలికిపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1,16,36,260 అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం, మార్చి 4: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి మల్లాయిపాలెం పరిధిలోని కొత్త కాలనీలో సానబోయిన దేవిశ్రీ భర్తమోహన్, అత్తమామలతో కలిసి నివాసం ఉంటోంది. వారికి పన్నెండేళ్ల కుమారుడు తనూజనాగసూర్య, ఎనిమిదేళ్ల కుమార్తె వర్షిణి ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాప్రకారం..శాటిలైట్ సిటీలోని డీ బ్లాక్‌కు చెందిన బోయిన ముసలయ్య, నీలాల మంగారావు రాడ్ బెండింగ్ పనికి వెళ్లేవారు. వాళ్లతో ముసలయ్య అన్న దుర్గారావు కూడా వెళ్లేవాడు. అయితే దుర్గారావుతో మంగారావు మందు తాగించి పాడు చేస్తున్నాడని దుర్గారావు తండ్రి మంగారావును మందలించాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 25న గొడవ జరిగింది. దీంతో మంగారావుపై ముసలయ్య కక్ష పెంచుకున్నాడు. మరుసటి రోజు ఉదయం పనికి వెళదామంటూ మంగారావును ముసలయ్య కల్లు దుకాణానికి తీసుకెళ్లి బాగా తాగించాడు. ఇంటికి తీసుకెళతానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని కవలగొయ్యి వెళ్లే దారిలో ఓ తోట వద్ద మంగారావును కిందపడేసి ముఖంపై బండరాయితో కొట్టి చంపేశాడు. దీనిపై అప్పటి బొమ్మూరు సీఐ కె.దామోదర్‌రావు కేసు నమోదు చేశారు. బోయిన ముసలయ్యపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఏ.బాషా, కోర్టు విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు. ట్రైల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణ ఫలితాలనిస్తోందని ఆయన చెప్పారు.

మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్(కాకినాడ), మార్చి 4: ఉమ్మడి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో ప్రకటించిన ఫార్మాసిస్ట్, లాస్ట్ గ్రేట్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ పోస్టుల నియామకం కోసం అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ జాబితాలను ఆన్‌లైన్ ఎన్ఐసీలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు లిస్ట్‌ను పరిశీలించుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాకినాడలో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ కింది వెబ్‌సైట్‌లో జాబితాలను పరిశీలించుకోవాలన్నారు.

http://eastgodavari.ap.gov.in
http://kakinada.ap.gov.in
http://konaseema.ap.gov.in

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కరప, మార్చి 4: కరప మండలం కొంగోడు గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతిచెందాడు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడిశెట్టి రమణయ్య(42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా సోమవారం ఉదయం రమణయ్య కొంగోడు గ్రామం ఎంట్రన్స్‌లో ఆర్చ్ పక్కన చింతా బూరయ్యకు చెందిన పాన్‌షాపుకు షెడ్డు వేసే పని చేస్తున్నాడు. షెడ్డుకు కర్రలు కడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్రిడ్జ్ విద్యుత్ వైర్లు ఇనుప రాడ్‌కు తగిలి రమణయ్య షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న రమణయ్యను గొల్లపాలెం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అతని భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ప్రజాదరణ పొందిన నేత వరుపుల రాజా

రాజా విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రులు రాజప్ప, సుజయకృష్ణ

ప్రత్తిపాడు, మార్చి 4: ప్రజల మన్ననలతో రాజకీయాల్లో రాణించిన గొప్ప నేత వరుపుల రాజా అని మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, సుజయకృష్ణ రంగారావు కొనియాడారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరుపుల రాజా విగ్రహాన్ని సత్యప్రభతో కలిసి మాజీ మంత్రులు ఆవిష్కరించారు. రాజా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధి కోసం రాజా జిల్లాలో కష్టపడి పని చేశారని ఆయన లేని లోటు తీర్చలేనిదని నియోజకవర్గంలో అన్ని వర్గాల వారిని కలుపుకుని వెళుతున్న సత్యప్రభకు రాబోయే ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ జోనల్ 2 కోఆర్డినేటర్ సుజన కృష్ణ రంగారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వరుపుల రాజా ఆత్మ శాంతి చేకూరే విధంగా ఎన్నికల ఫలితం ఉండాలని ఆ విధంగా రాజా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. సత్యప్రభ భవిష్యత్ కోసం తమ పార్టీ అధినేత చంద్రబాబు ఎంతో ఆలోచిస్తున్నారని, ఆమెకు ఏ ఇబ్బంది కలగకుండా ఆమెను ముందుండి నడిపించే విధంగా తోడ్పాటు నందించాలని చంద్రబాబు తమను పదేపదే ఆదేశిస్తున్నారని చెప్పారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు యనమల కృష్ణుడు, వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు), ఎస్‌వీఎస్ అప్పలరాజులు, సానా ఫౌండేషన్ నాయకుడు సానా సతీష్ బాబు, టీడీపీ నాయకులు పర్వత సురేష్, ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇతంశెట్టి భాస్కరబాబు, బద్ది రామారావు, తోట నవీన్, బోదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, తుమ్మల రామస్వామి, పెంటకోట మోహన్, దాసం శేషారావు పాల్గొన్నారు. రాజా వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆయన అభిమానులు 100 మంది రక్తదానం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ప్రారంభించారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పునరావాస సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం

దేవీపట్నం,మార్చి 4: పునరావాస సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దేవీపట్నం, తొయ్యేరు గ్రామాల పోలవరం నిర్వాసితులు విజయవాడలో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. 'మండలంలో 44 గిరిజన, గిరిజనేతర గ్రామాలు పోలవరం ప్రాజెక్టు మూలంగా పూర్తిగా నీటమునిగాయి. ఇంకా అనేక మందికి భూ పరిహారాలు, పునరావాసం కూడా ఇంకా కల్పించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వందలాది మంది ఇళ్ల నిర్మాణం పూర్తికాక నిలువ నీడలేకుండా అవస్థలు పడుతున్నారు. ప్యాకేజీకి అర్హులైన 1200 మందికి జాబితాలో చోటు దక్కలేదన్నారు. 630 ఇళ్లు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు' అని అన్నారు. మొదటి, రెండు, మూడు జాబితాల్లో సుమారు 600 మందికి పునరావాసం పరిహారం జమ కాలేదన్నారు. రెండు, మూడు జాబితాల్లో ఉన్న వారితో పాటు ఇంకా 520 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పునరావాస కాలనీతో పాటు దేవీపట్నం, పూడిపల్లి గ్రామాలకు ఇంకా శ్మశాన వాటికలకు స్థలం కేటాయించలేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాలను వదిలి వచ్చినప్పటి నుంచి తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలిశెట్టి శివరామకృష్ణ, సిద్ధా సత్యనారాయణ, సిద్ధా వీరబాబు, దొడ్డా సింహాద్రి, కుడిదేల గంగరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం, మార్చి 4: నాలుగు రోజుల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చెప్పారు. గోకవరం మండలం కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహానికి సీటు కేటాయిస్తే ఆయన గెలుపునకు సహకరించాలని ఉందని కానీ తన వర్గాన్ని ఆయన చిన్నచూపు చూడడం వల్ల మరోమారు పునరాలోచనలో పడాల్సి వస్తుందన్నారు. ఇంట్లో వాళ్లతో కూడా ఓట్లు వేయించలేని నాయకులు నరసింహం చుట్టూ చేరి ఆయనను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమన్నారు. తన విషయంలో అధికారులను కూడా ప్రోటోకాల్ పాటించకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అటు నాయకుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ పార్టీ పరువు దిగజారిపోతోందని ఆయన ఆందోళన చెందారు. నరసింహం తన కేడర్ మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే హోదాలో తాను కల్పించిన పదవులను సైతం తన వర్గం నుంచి చెప్పాపెట్టకుండా లాక్కొని వేరేవారికి అప్పగించారన్నారు. ఆయన తీరుపట్ల తన కేడర్ అసంతృప్తితో ఉందన్నారు.



విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంటిబాబు

ఘనంగా త్రయంబకేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

జగ్గంపేట, మార్చి 4: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో భాగంగా సోమవారం 8వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూరామణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని త్రయంబకేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శ్రీ నవశక్తి క్షేత్ర విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరమ పూజ్యశ్రీశ్రీ భవాని శంకరానంద స్వామి మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని తమ స్వహస్తాలతో కోటి పార్థివలింగాలకు అభిషేకం నిర్వహించారు. గోకవరం గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ధార్మిక సేవకులు కంబాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని శంకరానంద స్వామి మాట్లాడుతూ సృష్టికి మూలం ఓంకార శబ్దమని ముక్కోటి దేవతలను మనం దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేసిన జ్యోతుల నెహ్రూ కైలాసమే ఇక్కడ నిర్మించారన్నట్లుగా దేవాలయాలు నిర్మించారన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారని చెప్పారు. మహారుద్రాభిషేకం కార్యక్రమం చేయడం అనితర సాధ్యమన్నారు. సాయంత్రం ప్రవచనాల సందర్భంగా శివతత్వంపై వివరించారు.

మావోయిస్టుల లేఖ విడుదల

చింతూరు, మార్చి 4 : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8న ఘనంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ మావోయిస్టు పార్టీ ప్రతినిధి అజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పేరిట ఓ లేఖ విడుదలైంది. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల రాజ్య హింసలకు, హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడదామని, స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించుకుందామని, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాద సంకెళ్లను తెంచుకుందామని, స్త్రీ విముక్తి పోరు బాటలో నడుద్దామని, శ్రామిక విముక్తి లేనిదే స్త్రీ విముక్తి లేదని లేఖలో అజాద్ పేర్కొన్నారు. పల్లెల్లో రైతు మహిళల శ్రమ శక్తి దోపిడికి గురవుతోందని, పట్టణాలలో పెట్టుబడిదారులు తక్కువ వేతనాలు ఇచ్చి మహిళలతో వెట్టి చాకిరీ చేయిఁచుకుంటున్నారని ఆజాద్ ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎందరో వీరవనితలు పోరాటం చేసి ప్రాణాలు అర్పించారన్నారు. పోలీసులు పాల్పడుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎందరో వీర వనితలు సమర శీల పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. చివరకు వ్యాపార ప్రకటనలలో సైతం మహిళలను అశ్లీలంగా చూపిస్తూ అంగడి సరుకుగా మార్చారని అజాద్ ఆరోపించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం, మార్చి 4: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 16.467 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గోకవరం పోలీసులు సోమవారం జరిపిన దాడుల్లో మండలంలోని కొత్తపల్లి పెదచెరువు నుంచి రామన్నపాలెం వెళ్లే రోడ్డులో గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ఒడిసా రాష్ట్రానికి చెందిన గణపతి జిల్లాలోని చెంబాలపూర్ గ్రామానికి చెందిన అక్షయరైటా, జిబిత్‌రైటాలను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.82,335 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చాగల్లు మండలంలోని కలవలపల్లిలో వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ పక్కన ఖాళీ ప్రదేశంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేశారు. 46 బస్తాల్లో నిల్వ ఉంచిన 2050 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మెట్టపల్లి నరసింహరాజు రామచంద్రాపురం, ఉనకరమిల్లి గ్రామాల్లో రేషన్ బియ్యం కిలో రూ.16 చొప్పున సేకరించి ఇటుక బట్టీలు తదితర చోట్ల పనిచేస్తున్న కూలీలకు రూ.18కి విక్రయిస్తున్నాడని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.92,375 ఉంటుందని, నరసింహరాజుపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశామని ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ అమ్మకం, నిల్వలపై నిఘా పెట్టామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దని భార్య వారించినందుకు నిప్పంటించుకున్న భర్త

సర్పవరం జంక్షన్, మార్చి 4: అనారోగ్యంతో ఉంటూ మద్యం తాగుతున్న భర్తను మద్యం తాగవద్దని భార్య వారించడంతో కోపంతో టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్.అచ్యుతాపురంలో ఆదివారం రాత్రి జరిగింది. కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురానికి చెందిన పైడా సుబ్బారావు (64)కు 2017లో ఆపరేషన్ జరిగింది. డాక్టర్లు మద్యం తాగవద్దని సూచించారు. అయితే గత ఆరు నెలల నుంచి కుటుంబ సభ్యులు మందలిస్తున్నా మద్యం తాగడం ప్రారంభించాడు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావు, తాగవద్దని డాక్టర్లు చెప్పారు కదా అని భార్య నిలదీసింది.. దాంతో ఇంట్లో ఉన్న టర్పంటాయిల్‌ని శరీరంపై పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సమీపంలో నాగమల్లితోట జంక్షన్‌లో గల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. కుమారుడు భార్గవి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలి

రంపచోడవరం, మార్చి 4: ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల బాలురెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. అటవీ ఫలసాయం, జీడిపిక్కలు, జాఫ్రా గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. తొలుత ఈ నెల పదో తేదీన ఏజెన్సీ మన్యం బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరుతూ తీర్మానించారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

రంపచోడవరం, మార్చి 4: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆమె ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సుమారు 48 అర్జీలు అందాయన్నారు. పులిగోగులపాడులో జీడిపిక్కల ప్రాసెసింగ్ ఏర్పాటు చేయాలని, 18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, భూపతిపాలెం జలాశయంలో పర్యాటక శాఖ ద్వారా విహార బోట్లకు అనుమతి మంజూరు చేయాలని, సొసైటీ సభ్యులకు చేపలు పట్టుకొనేలా ఉత్తర్వులు మంజూరు చేయాలని, గుర్తేడు, ధారకొండ, ఎడ్లకొండ గ్రామాల్లో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్డీసీలు జాన్‌రాజ్, డీఎస్ శాస్త్రి, డీడీ షరీఫ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయసునీత

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

రంపచోడవరం, మార్చి 4: విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆమె ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు, పరీక్షా కేంద్రాలలో లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

గండేపల్లి, మార్చి 4: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డోలా సంజయ్ తెలిపారు. ముఖ్య అతిథిగా పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.దీప దైవకృప మాట్లాడుతూ మహిళలు, యువత సమాజం నందు జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిషేధం చట్టంపై ఆమె వివరించారు.

టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలి

ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 4: రాష్ట్రం బాగుపడాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక 14వ వార్డులో సోమవారం ఆయన ప్రచారాన్ని చేపట్టి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతానని అధికారంలోకి వచ్చిన జగన్ నవరత్నాలంటూ పన్నులు, బస్సు, కరెంటు చార్జీలతో అన్నివర్గాల ప్రజలకు వాతపెట్టారన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, ఆరీఫ్ ఆలీ, తూతిక రాజు తదితరులు పాల్గొన్నారు.

'కొత్త నాటకానికి తెరతీసిన ద్వారంపూడి'

కాకినాడ సిటీ, మార్చి 4: కాకినాడలో ఉన్న మత్స్యకారులు ఎమ్మెల్యే ద్వారంపూడి మాయమాటలు నమ్మి మోసపోవద్దని, మత్స్యకార జాతిని దూషించి హేళన చేసిన ద్వారంపూడి దాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త నాటకానికి తెరతీశారని టీడీపీ కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లలో మత్స్యకారులను అన్ని విధాలుగా మోసం చేసి ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ద్వారంపూడి మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పిస్తానని నమ్మబలికి అబద్ధాలు చెప్పి నెగ్గారని, ఇప్పుడు ఎన్నికల్లో మత్స్యకారులు దూరమవుతున్న విషయం గ్రహించి ప్రణాళిక రచించి వారిని రెచ్చగొట్టి రోడ్డెక్కించి ఆటలాడుకుంటున్నారని విమర్శించారు.

'సముద్రపు తాబేళ్లను కాపాడాలి'

తాళ్లరేవు, మార్చి 4: సముద్రపు తాబేళ్లు అంతరించకుండా కాపాడే బాధ్యత పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ భాగస్వాములు కావాలని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ బండి రాజశేఖర్ అన్నారు. సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరింగ ఫారెస్ట్ బంగ్లాలో సముద్రపు తాబేళ్ల సంరక్షణపై అవగాహన కల్పించారు. కస్టమ్స్, మత్స్యశాఖ, మెరైన్ పోలీస్, ఫోర్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సముద్రపు తాబేళ్ల సంరక్షించే విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో టి.అనూష, జిల్లా అధికారి ఆశాకిరణ్, మత్స్యశాఖ ఎడీ లావణ్య, రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్, సెక్షన్ అధికారులు ఎమ్.నాగార్జున, ప్రసాద్, బీటు ఆఫీసర్లు సంధ్యారాణి, గోపీనాగేంద్రప్రసాద్, మహేష్‌ధనంజయరావు పాల్గొన్నారు.

'ఓటుహక్కు వినియోగంలో అప్రమత్తం'

గొల్లప్రోలు, మార్చి 4: ప్రజలంతా ఓటుహక్కు వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగంపై ఓటరు జాగృతి కరపత్రాల పంపిణీ, ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఆయన సోమవారం గొల్లప్రోలులో ప్రారంభించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపురాజు, కొశిరెడ్డి త్రిమూర్తులు, చేదులూరి సత్యనారాయణ, కంకటాల శ్రీనివాసరావు, జ్యోతుల శివ, రాపర్తి వీర్రాజు, మర్రి సత్తిబాబు, సఖినాల లచ్చబాబు, సేవాసమితి కార్యదర్శి మేకల కృష్ణ పాల్గొన్నారు.

'ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి'

కొత్తపల్లి, మార్చి 4: ఓటు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, కొత్త ఓటు నమోదుపై సోమవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు, వీవీఎస్ విద్యాసంస్థల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు, ఇళ్ల వద్ద తల్లిదండ్రులకు ఓటు వినియోగం, దాని ప్రాధాన్యతపై వివరించాలన్నారు. బ్యాలెట్ పత్రం బదులు ఎలక్ట్రానిక్ యంత్రంపై ఓటు ఎలా వేయాలనే విషయంపై ఎంపీడీవో వివరించారు. అవగాహన సదస్సులో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రత్తిపాడు, మార్చి 4: టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం కాకినాడ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సానా ఫౌండేషన్ అధినేత సానా సతీష్‌బాబు తెలిపారు. ప్రత్తిపాడులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గానికి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మాజీ జడ్పీటీసీ తోట నవీన్ మాట్లాడుతూ ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. జనసేన, టీడీపీ నాయకులు తుమ్మల రామస్వామి, వరుపుల తమ్మయ్యబాబు, పెంటకోట మోహన్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తదితరులున్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ఏలేశ్వరం, మార్చి 4: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాల్లపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నింపేట గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసీపీ 2023లో తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో కందా వీరాస్వామి, తోలేటి గంగాధర్, రామకుర్తి రాజబాబు, రామకృష్ణ పాల్గొన్నారు

'లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించాలి'

తాళ్లరేవు, మార్చి 4: మండలంలో జగనన్న ఇళ్ల స్థల పట్టాల లబ్ధిదారులకు స్థలాలను చూపించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పటవల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కోరింగలో, తాళ్లరేవు గ్రామానికి చెందిన కొంతమందికి బొడ్డువానిలంక, గాడిమొగలోని ఇళ్ల స్థలాలు పట్టాలిచ్చారని కానీ ఇప్పటివరకు లబ్ధిదారులకు స్థలాలు చూపించలేదని తెలిపారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, మార్చి 4: స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలం సూరంపాలెనికి చెందిన కుంచే సత్తిబాబు జ్ఞాపకార్థం వారి కుమారుడు గండేపల్లి వైఎస్ ఎంపీపీ కుంచే రాజా ఆర్థిక సాయంతో పేదలకు భోజనాలను ఏర్పాటు చేసి వడ్డించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, కొత్త కొండబాబు, సూరంపాలెం బాలు, కుంచే రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, యల్లమిల్లి సీఎం, దేగల సత్తిబాబు, బద్ది సురేష్, నేదూరి గణేష్, కొండ్రోతు శ్రీను తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రాజశేఖరస్వామి కల్యాణోత్సవాలు

కొత్తపల్లి, మార్చి 4: కొత్తపల్లిలో శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి కల్యాణమహోత్సవాలు ఈనెల 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు ఇలపర్తి రామజోగేశ్వరశర్మ తెలియజేశారు. 6న ఉదయం స్వామికి అభిషేకాలు, కుంకుమ పూజలు, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి 7గంటలకు స్వామి కల్యాణం, 7న స్వామికి అభిషేకాలు, కుంకుమ పూజ, శ్రీలలిత సహస్రపారాయణం, సాయంత్రం ముగ్గులు పోటీలు.. 8న మహాశివరాత్రి, మాసశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, కుంకుమపూజ, సదస్యం.. 9 స్వామికి అభిషేకాలు,కుంకుమ పూజ, 10న సాయంత్రం స్వామి రథోత్సవం, 11న శ్రీపుష్పయాగంతో మహోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనులు

సామర్లకోట, మార్చి 4: సామర్లకోట గోదావరి కాలువలో హుస్సేన్‌పురం ఎగువ ప్రాంతాల్లో గుర్రపుడెక్క అవరోధాల కారణంగా సాగునీటికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఇరిగేషన్ అధికారులు స్పందించారు. దీంతో సోమవారం హుస్సేన్‌పురం దళితవాడ వంతెన వద్ద పెద్దఎత్తున చేరిన గుర్రపుడెక్క అవరోధాలను భారీ ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగింపు పనులు చేట్టారు. సాగునీటి ఇబ్బందులపై రైతులు పడుతున్న అవస్థలపై ఆంధ్రజ్యోతిలో వరుసగా కథనాలు ప్రచురించడంతో జిల్లా అధికారులు స్పందించి సత్వరం చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారుల చర్యలతో కాలువలో సోమవారం కొంతమేర గుర్రపుడెక్క అవరోధాలు తొలగి సామర్లకోట లాకుల వద్దకు అధికంగా నీరు చేరింది. దీంతో ఉండూరు కాలువ, వీకె.రాయపురం కాలువకు సాగునీరు సమృద్ధిగా పారుదల అయ్యింది.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

తిరుమల	: అంబాజీపేట మ్యారేజిబ్యాండు
లక్ష్మి	: ఆపరేషన్ వాలెంటైన్
సీ అండ్‌సీ1	: హనుమాన్
సీ అండ్‌సీ2	: ఆపరేషన్ వాలెంటైన్
శ్రీప్రియ	: సుందరంమాస్టర్
పద్మప్రియ	: ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి	: భూతద్దం భాస్కర్
సూర్య 1	: ఆపరేషన్ వాలెంటైన్
సూర్య 2	: కిక్

కాకినాడలో 'మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 4: 35వ డివిజన్ నూకాలమ్మగుడివద్ద జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య ఆధ్వర్యంలో మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. శశిధర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలు కోరుకుంటున్న మాట వాస్తవమే కానీ పన్నులు పెంచేసి ము క్కుపిండి వసూలు చేసి సంక్షేమ పథకాలు ఇస్తే లాభమేమంటని ప్రశ్నించారు. అడబాల సత్యనారాయణ, మనోహర్, శ్రీమన్నారాయణ, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారులను పట్టించుకోరా?

ఎక్కడికక్కడ గోతులు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



రాళ్లు పైకి లేచి అధ్వానంగా ఉన్న మల్లేపల్లి నుంచి యల్లమిల్లి వెళ్లే రహదారి

గండేపల్లి, మార్చి 4: వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడ చూసినా రోడ్లు గోతులమయంగా మారి రోడ్డుకు వేసిన కంకరు బయటకు వచ్చి చెల్లాచెదురుగా పడటంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. గండేపల్లి మండలంలో మల్లేపల్లి నుంచి యల్లమిల్లి, రంగపేట, గండేపల్లి వెళ్లే రోడ్డు, గండేపల్లి నుంచి సింగరాయపాలెం వెళ్లే రహదారి, తాళ్ళూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లల్లో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. కనీసం గోతులు పూడ్చాలని నాయకులకు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రయాణీకులు, మండల ప్రజలు వాపోతున్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, మార్చి 4: సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో సామర్లకోట అయోధ్యరామపురం కూడలి ప్రాంతం వద్ద పెద్దపెద్ద గోతుల వల్ల నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరామ్మతలు చేపట్టినప్పటికీ కనీసం 10 రోజులు కాకుండానే తిరిగి గోతులు ఏర్పడ్డాయని టీడీపీ మాజీ కౌన్సిలర్ చుండ్రు బలరామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల ఈ ప్రాంతంలో గోతిలో చక్రాలు దిగబడి ఆటో తిరగబడి అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వరం స్పందించి గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని బలరామ్ కోరారు.



సామర్లకోటలో గోతులతో ప్రమాద భరితంగా ఉన్న రోడ్డు

ఎన్నికల నిర్వహణకు కలిసి పనిచేద్దాం : ఎస్పీ



ప్రత్తిపాడు సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ

ప్రత్తిపాడు, మార్చి 4: రాబోయే ఎన్నికల నిర్వహణకు పోలీస్ యంత్రాంగమంతా కలిసి పనిచేద్దామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. ప్రత్తిపాడులోని సరయు ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్నిపోలీస్ అధికారుల సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు ఆత్మీయ సమావేశాలు ఎంతో దోహదపడతాయన్నారు. తరుచూ ఆత్మీయసమావేశాలు నిర్వహించుకుంటూ పోలీస్ యంత్రాంగం ఉత్సాహంగా ఉత్తేజంగా పని చేయాలని సూచించారు. సిబ్బందికి ఏ ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ఎస్పీ కోరారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సొంత ఖర్చులతో కూర్చిన చీరలను మహిళా పోలీసులకు ఎస్పీ అందజేశారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ప్రత్తిపాడు, కిర్లంపూడి ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జబీర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన విజయం కోరుతూ పూజలు



పిఠాపురంలో పూజలు చేసిన శ్రీధర్, నాయకులు

పిఠాపురం, మార్చి 4: టీడీపీలో పొత్తులో భాగంగా జనసేన పోటీ చేసే 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు స్థానాల్లో అధిక మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ నియోజకవర్గ జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్, దీపిక దంపతుల ఆధ్వర్యంలో సోమవారం పూజలు నిర్వహించారు. పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో 1008 కొబ్బరికాయల ముడుపులను ఔదంబర వృక్షానికి కట్టారు. అనంతరం ఆలయం బయట కొబ్బరికాయలు కొట్టారు. జనసేన అధినేత పవన్ పేరుతో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహసరస్వతులకు పూజలు జరిపించారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుని ఆశీస్సులు జననేన అధినేత పవన్‌పై ఉండాలని కోరుతూ పూజలు నిర్వహించామని చెప్పారు. జనసేన నాయకులు కంబాల దాసు, కొలికొండ శశియాదవ్, గరగ సత్యానంద రావు, పల్లేటి బాపన్నదొర, ఇంటి వీరబాబు, జవ్వాది జోగేశ్వర రావు, రంగనాదం నూకరాజు, దుడ్డు రాంబాబు, గేదెల వెంకట్రావు, మాదేపల్లి శ్రీను, దానం లాజరుబాబు, కందా చంద్రబాబు, పిల్లా ముత్యాలరావు, దాసరి కిరణ్ తదితరులున్నారు.

వరుపుల రాజాకు నివాళి



ప్రత్తిపాడు: రాజా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మార్చి 4: దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం పెదశంకర్లపూడిలో రాజా సమాధి వద్ద ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, ఆమె తనయుడు సాయి తర్షిత్, కుమార్తె సత్యమాధురి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడులో రాజా విగ్రహావిష్కరణ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ జరిగింది. ప్రత్తిపాడులో 1000 మంది విద్యార్థులకు వరుపుల సత్యప్రభ నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, మాజీ సర్పంచ్ మోరా వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ శెట్టి బత్తుల వీరబాబు, మదినే దొర బాబు, వైగోవింద నాయుడు,పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రౌతులపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీకి దివంగత నేత వరుపుల రాజా చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరరావు, గంటా గోపి, అల్లు బుజ్జీ అన్నారు. రౌతులపూడిలో ప్రభుత్వాసుపత్రి నందు రాజా చిత్రపటానికి నివాళులర్పించారు. రోగులకు పాలు, పండ్లు అందజేశారు.గురునాద్, ధనాజీ తదితరులు పాల్గొన్నారు.

'పవన్ బాటలోనే నడుస్తాం'

గండేపల్లి, మార్చి 4: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బాటలోనే తామంతా నడుస్తామని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి, సూరంపాలెం ఉపసర్పంచ్ బాలు అన్నారు. మల్లేపల్లిలో సోమవారం జనసైనికులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ నిర్ణయానికి వ్యతిరేకంగా పాఠంశెట్టి సూర్యచంద్ర దీక్ష చేపట్టి విరమిం చారన్నారు. మోసపూరి తమాటలకు జనసైనికులు మోసపోవద్దని హితవు పలికారు.

కిర్లంపూడి: జగపతినగరంలో జనసేన నాయకులు ఆళ్ళ శ్రీమన్నారాయణ, నానాజీ పాఠంశెట్టి సూర్యచంద్రను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గ జనసేన నాయకులంతా పవన్ ఆదేశాల మేరకే నడుచుకుంటామన్నారు. సూర్యచంద్ర పవన్‌పై చేస్తున్న విమర్శలు సరికాదన్నారు. కిర్లంపూడి మండలాధ్యక్షులు ఉలిసి అయిరాజు, ఆరిన రాజేష్, ఉపాధ్యక్షులు కాకిలేటి బాబ్జి, అధికార ప్రతినిధి పాతిరెడ్డి శేఖర్, చిరంజీవి, యువత అధ్యక్షులు ఎటుబంటి శివ, ప్రధాన కార్యదర్శులు పిడుగు జయబాబు, కాలపరెడ్డి నాని, ఆకుల నవీన్ ఉన్నారు.

మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాష్



మహిళా రైతులతో మాట్లాడుతున్న జేడీ

కరప, మార్చి 4: జగనన్న పాలవెల్లవ పథకం ద్వారా మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ తెలిపారు. మండలంలోని అరట్లకట్ట గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి డెయిరీ ఏర్పాటుకు అవసరమైన పరికరాల అమరికను పరిశీలించారు. స్థానిక మహిళా పాడిరైతులతో ఆయన సమావేశమై డెయిరీ కార్యకలాపాలను వివరించారు. అమూల్ కంపెనీ మిగిలిన డెయిరీల కంటే అధిక రేటు చెల్లించి పాలను సేకరిస్తుందన్నారు. అమూల్ పాలసేకరణ కేంద్రానికి పది రోజుల పాటు పాలు పోస్తే 13వ రోజునే బ్యాంక్ ఖాతాకు సొమ్ములు జమచేయడం జరుగుతుందన్నారు. అలాగే పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, ఆ కార్డును 7శాతం వడ్డీపై రూ.35వేలు వరకు వాడుకోవచ్చన్నారు. సకాలంలో తిరిగి చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రిబేట్ వస్తుందని తెలిపారు. పాడిగేదె కొనుగోలుకు స్త్రీనిధి నుంచి రూ.75వేల వరకు రుణం మంజూరుచేస్తామన్నారు. ఈ పథకం మొదటి విడతలో 8మండలాల్లో 96గ్రామాల్లో పాలసేకరణ జరుగుతుందని, ప్రస్తుతం ఆయా కేంద్రాల ద్వారా రోజుకు 19వేల లీటర్ల పాలసేకరణ చేపడుతున్నామన్నారు. కరప మండలంలో 14 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఎన్‌జే సురేష్‌బాబు, డాక్టర్ తిరుమలరావు, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైసీపీ ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలులో శంఖారావం నిర్వహిస్తున్న వర్మ

గొల్లప్రోలు, మార్చి 4: ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులకు టీడీపీ హయాంలో మంజూరైన నిధులను, టెండర్లును రద్దు చేయించిన వైసీపీ ప్రజాప్రతినిధులు మళ్లీ నిధులు తేవడంలో పూర్తిగా విఫలమయ్యారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. ముంపు సమస్యను పరిష్కరించలేక వారు చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. గొల్లప్రోలు 19,20 వార్డుల్లో సోమవారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల క్యాలండర్, బాబుతో నేను, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందజేశారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో తాను ఎమ్మెల్యేగా ఉండగా అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.156కోట్లు నిధులు తెచ్చినట్లు వర్మ చెప్పారు. 70కోట్లుతో వాటర్ స్కీమ్ మంజూరు చేయించి పనులు ప్రారంభించగా, వాటిని ఇప్పటి వరకూ వినియోగించులేక పోయారని తెలిపారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, నాయకులు బస్వా సత్యనారాయణ, నాగేశ్వరరావు, దువ్వా తాతాజీ. కడారి బాబ్జి, వెంకటేష్, గుళ్ల సుబ్బయ్య, దొమ్మేటి మనోహర్, బచ్చల శౌరి, వెన్నా బాపిరాజు ఉన్నారు.

మహిళలకు భద్రత కరువు

పిఠాపురం రూరల్, మార్చి 4: వైసీపీ పాలనలో మహిళలకు భద్రత కరువైందని మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి విమర్శించారు. పిఠాపురం మండలం జములపల్లిలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, అంబటి మూర్తి, మంగాదేవి, కూసి రాంబాబు, బర్ల అప్పారావు, రవివర్మ, చిరంజీవి, ఎలుబండి రాజారావు, బాబులు, మలిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

సాగునీరు అందివ్వాలని రైతుల ఆందోళన



తాళ్లరేవులో ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లరేవు, మార్చి 4: కోరింగ కెనాల్‌పై ఆనుకుని ఉన్న తాళ్లరేవు, పోలేకుర్రు, గాడిమొగ శివారు భూములకు సాగునీరు అందివ్వాలని రైతులు సోమవారం తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి అధికారులను నిలదీశారు. వారు మాట్లాడుతూ పై నుంచి నీరురావడం లేదని అధికారులు చేతులు ఎత్తేస్తున్నారని, సుమారు 15రోజులుగా కోరింగ కెనాల్ కాలువను కట్టేసి, పి.మల్లవరం ఏరియాకు సాగునీరు వదలడంతో కోరింగి కెనాల్‌పై ఉన్న ఆయకట్టు 3,500 ఎకరాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పొట్టదశకు వచ్చేసరికి సాగునీరు లేక ఎండిపోతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు పోతుల చక్రశేషారావు, దంగేటి శ్రీనివాస్, దాట్ల నరసింహరాజు, రెడ్డి శ్రీనివాస్, కాపారాం బాబు, గుబ్బల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజులు కీలకం



కోటనందూరు సమావేశంలో మాట్లాడుతున్న యనమల కృష్ణుడు

కోటనందూరు, మార్చి 4: ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో రానున్న రోజులు చాలా కీలకమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అన్నారు. సోమవారం కోటనందూరులో పార్టీ గ్రామ అధ్యక్షుడు అంకంరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. కృష్ణుడు మాట్లాడుతూ త్వరలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. తుని నుంచి అధిక సంఖ్యలో మెజార్టీ వస్తుందన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. బుధవారం జరిగే మండల సమావేశం విజయవంతం చేయాలని కోరారు. మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, డి.చిరంజీవిరాజు, శివబాబు, బంటుపల్లి వెంకటేశ్వరరావు, పెనుముచ్చుప్రవీణ్, లెక్కల బాస్కర్, ఎనానబ్బాయి,పెనుముచ్చు నాగేశ్వరరావు, చింతకాయల రవి, లగుడు సత్యనారాయణమూర్తి ఎసత్యనారాయణ,పంపనబోయిన దొంగబాబు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జగ్గంపేట రూరల్, మార్చి 4: జగ్గంపేట పోలీస్ స్టేషన్ ముందు వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన నక్కన నాగేశ్వరరావు కుమార్తె జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామంలో అమ్మమ్మ,తాతయ్య ఇంటి వద్ద ఉంటూ జగ్గంపేటలో ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతుంది. అయితే ఈనెల 1న మైనర్ బాలిక అదృశ్యం అవ్వడంతో తండ్రి నాగేశ్వరరావు తాను నివాసం ఉంటున్న కామరాజుపేట గ్రామానికి చెందిన బాలుడిపై అనుమానంతో జగ్గంపేట ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణలో బాలిక వేరే వ్యక్తితో వెళ్తున్నట్టు గుర్తించారు. అబ్బాయి తల్లిదండ్రులను, అతడి స్నేహితులను విచారణ నిమిత్తం జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి 2 రోజుల నుంచి విచారణ చేస్తున్నారు. అందులో ఒక విద్యార్థికి ఇంటర్ పరీక్షలు ఉండడంతో పరీక్ష రాసి తిరిగి పోలీస్ స్టేషన్‌కి రావాలిసిందిగా పోలీసులు సూచించారు. విద్యార్థిని పరీక్షకు పంపించవద్దని పోలీసులతో బాలిక తండ్రి చెప్పారు. విద్యార్థి పరీక్షా మానడం కుదరదని, రాయించి తిరిగి తీసుకొచ్చి విచారణ చేస్తామని పోలీసులు చెప్పడంతో బాలిక తండ్రి నాగేశ్వరరావు స్టేషన్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. పోలీసులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆయన పరిస్థితి నిలకడగా ఉంది.

జగన్‌ను కలిసిన ద్వారంపూడి

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 4: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సీఎం జగన్‌ను కలిశారు. సిటీ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సీఎంతో చర్చించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కాకినాడలో సమస్య వింటున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 4: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. ఫోన్ ద్వారా 12మంది వివిధ స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్ నాగనరసింహారావు ఫిర్యాదులు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 16మంది తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయసంచాలకులు టీవీ శిరిల్ పాల్గొన్నారు.

'పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి'

పెద్దాపురం, మార్చి 4: స్థానిక 14వ వార్డు రామారావుపేటలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆప్రాంత వాసులు స్పందన కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానికంగా లూథరన్ హైస్కూలుకు చెందిన క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని చాలాకాలంగా వినియోగించకపోవడంతో ఆప్రాంతంలో పిచ్చితుప్పలు విపరీతంగా పెరిగిపోయి, విష జంతువులకు ఆవాసంగా మారిందన్నారు. దీనిపై స్థానిక యువకుడు కోరుకొండ ప్రశాంత్ మరికొంతమందితో కలిసి కార్యాలయం ఏవో సుబ్రహ్మణ్యానికి వినతిని అందజేశారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

సామర్లకోట, మార్చి 4: మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానుండడంతో భక్తులకు ఏ ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. సాదారణ, ప్రత్యేక, వీఐపీ భక్తులకు వేర్వేరుగా దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పవిత్ర స్నానాలచరించేందుకు ఆలయ కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణి, మాండవ్య నారాయణస్వామి పుష్కరిణిలతో పాటు పలువురు దాతలు ఏర్పాటుచేసిన జల్లు స్నానఘట్టాలు సిద్ధం చేశామన్నారు. సమగ్ర పారిశుధ్య చర్యల కోసం నిరంతరం పనిచేసే సిబ్బందిని నియమించామని, ఆలయ ఆవరణలో విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేశామన్నారు. మాఘమాసం, సోమవారం మహాపర్వదినం సందర్భంగా కుమార రామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు జరిగాయి.

బాబా మందిర వార్షికోత్సవం

కరప, మార్చి 4: సిరిపురం గ్రామంలో సోమవారం షిరిడీ సాయిబాబా మందిరం 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, జనసేన నేత చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపించి గ్రామోత్సవం చేపట్టారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహాన్నదానానికి 10వేల మంది విచ్చేసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, లయన్ డాక్టర్ బొండా వెంకన్నరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

కాకినాడ రూరల్, మార్చి 4: రూరల్ మండలం తూరంగికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం జనసేనలో చేరారు. జనసేన పీఏసీ సభ్యుడు, టీడీపీ జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ జనసేనలో చేరిన మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి త్రిమూర్తులు,మేడిశెట్టి సత్యనారాయణ, చిట్టూరివెంకట రమణ, మేడిశెట్టి మురళీ,వర్మ, సత్తిబాబు,రాఘవేంద్ర, మురళీకృష్ణలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా నానాజీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్నారు.

కూలీ రేట్లు పెంచాలని ధర్నా

సామర్లకోట, మార్చి 4: సామర్లకోటలో ఏపీ బేవరేజెస్ డిపో హమాలీ జట్టు కూలీలకు కూలీ రేట్లు పెంచాలని కోరుతూ సామర్లకోట ఐఎంఎల్ డిపో ఎదుట సోమవారం హమాలీలు ధర్నా, నిరసన నిర్వహించారు. రాష్ట్ర సీఐటీయూ పిలుపు మేరకు ఈ నెల 5న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నందున హమాలీలందరూ తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్నాలో సీఐటీయూ నేతలు విప్పర్తి కొండలరావు, అమలకంటి సోమేష్, వెన్నెల గోవింద్, పప్పుల సత్తిబాబు, నాళం తిరుమలరావు, శివ, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వాములకు సన్మానం

జగ్గంపేట, మార్చి 4: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం వైద్యులు శ్రీనివాసరావు, శ్యామ్‌కుమార్, ధర్మరాజు అనే ముగ్గురు స్వాములు తిరుపతికి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జిల్లా దొండపూడి గ్రామం నుంచి పనయమైన వారికి మార్గమధ్యలో సోమవారం జగ్గంపేటలో ఏఎంటీ ఫిజియోథెరపీ క్లినిక్ అధినేత డాక్టర్ జి.శ్రీరామమూర్తి అల్పాహారం అందజేసి సన్మానించారు. గ్రామీణ వైద్యులు చంద్రమౌళి పాపయ్యశాస్త్రి, వీరబాబు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం

గండేపల్లి, మార్చి 4: సూరంపాలెంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని ప్రారంభించారు. వేసవిదృష్ట్యా గ్రామంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

'బెదిరించి తీసుకెళ్లడం తగదు'

రౌతులపూడి, మార్చి 4: ప్రత్తిపాడులో వైసీపీ సభకు డ్వాక్రా సంఘం సభ్యులను బెదిరించి తీసుకెళ్లడం తగదని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు యాదగిరి శ్రీను అన్నారు. వైసీపీ ప్రజలకు నిజంగా మంచి చేస్తే వారే స్వచ్ఛందంగా వస్తారని, బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని చెప్పారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కిర్లంపూడి, మార్చి 4: పేదలందరికీ ఇళ్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి సత్యదేవ కల్యాణ మండపంలో సోమవారం తహశీల్దార్ ఆసయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ఇళ్ల పట్టాలు అందజేశారు.ఆర్ఐ సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూధర్మ ప్రచారం

ఏలేశ్వరం, మార్చి 4: పట్టణ వీధుల్లో సోమవారం హిందూధర్మ ప్రచారంలో భాగంగా శ్రీఅనంతలక్ష్మీ సమేత శ్రీ వీర వెంకటసత్యన్నారాయణ స్వామి దివ్య రథానికి చైతన్య నగర్, క్వారీపేటలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి పండూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

తపోవనంలో నెప్రూా పూజలు

తుని రూరల్, మార్చి 4: ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవనం క్షేత్రంలో జగ్గంపేట టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పూజలు ఆచరించారు. పీఠాధిపతులు శ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వెంట టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలున్నారు.